'పగిలిన గాజు పలకలా
భళ్లున నవ్వింది అవ్వ'.

# 5

## భాగస్వామి(ని)

అరవై ఏళ్ల జీవిత అనుభవాన్ని కాచి వడబోయగా తేలిన కఠోర సత్యంలా నవ్వింది అవ్వ.

"నా వైపు చూడు, అవ్వా! నేను అబద్ధం చెప్పడంలేదు" అన్నాడు అతడు, ఆమెకి నమ్మకం కలిగేలా అబద్ధం అన్నపదాన్ని ఒత్తిపలుకుతూ.

"నిన్ను చూస్తున్నాను నాయనా! అందుకే నమ్మలేకుండా ఉన్నాను. నేనేదో సహాయం చేస్తే నాకు కావలసినంత డబ్బు ఇస్తానంటున్నావు. కాని, బాబూ, నీ దగ్గరే డబ్బు ఉంటే మాసిన ఆ బట్టలతో వెన్నుకి అంటుకు పోతున్న ఆ కడుపుతో ఎందు కుంటావు? నీ యీడులో ఉన్న అందరిలా నువ్వూ మడతబట్టలు వేసుకొని, కడుపునిండా తిని, కాలరిగేలా తిరుగుతావు...."

"నువ్వన్నమాట నిజమే, అవ్వా! ప్రస్తుతం నా దగ్గర డబ్బు లేదు. అయినా నాకు తిండీ, బట్టా మాత్రమే ముఖ్యం కాదు. మనిషిగా పుట్టి పెరుగుతున్నందుకు ఇంకేదో సాధించాలి—అన్నదే నా ఆశయం....నా కోరిక... నా బాధ. దానికే నీ సహకారం కావాలంటున్నాను. ఈ పనిలో ఎంత సొమ్ము వచ్చినా అందులో సగం నీది. నా మాట నమ్ము. అదృష్టం కలిసివస్తే వెయ్యి....రెండు వేలు.... ఇంకా హెచ్చుగానే రావచ్చు. రెండు వేలు వస్తే వెయ్యి రూపాయలు నీ భాగం....అవ్వా, ఈ అవకాశాన్ని జారవిడువకు. వెయ్యి రూపాయలు అంటే మాటలు కాదు. నూరు పది రూపాయల కాగితాల్ని నీ జన్మలో ఎప్పుడైనా చూసేవా!....చూడగల ననుకొన్నావా!" అవ్వని ఏదో విధంగా ప్రలోభపెట్టి ఒప్పించాలని అతడి ఆలోచన.

అవ్వ తన జీవిత కాలంలో ఒక్క పది రూపాయల కాగితం కూడా చేతబటి ఉండదు. అయినా అతడు చెపుతున్న నూరు పది రూపాయల కాగితాల గురించి ఆమె ఆలోచించడం లేదు. కాలం పిలుపుకోసం ఎదురుచూస్తున్న ఆమెకి డబ్బుపట్ల అంత వ్యామోహం లేదు. కడుపు నిండడానికి పిడికెడు మెతుకులు, గుక్కెడునీళ్లు ఉంటే చాలు. అయినా తన వల్ల ఏదో పని కావాలని అతడు అంతలా అడుగుతుంటే కాదనలేక పోయింది. ఈ ముసలి కట్టెతో అవసరం ఉన్నవాళ్లు ఇంకా భూమి మీద ఉన్నారా అని ఆశ్చర్య పోయింది. "సరే. ఇంతకీ నన్నేం చెయ్యమంటావు?" సూటిగా అతడి కళ్ల లోకి చూస్తూ ప్రశ్నించింది.

"నీ బొమ్మ గీస్తాను." ఉత్సాహంగా అన్నాడు అతడు.

పగిలిన గాజుపలకలా భళ్లున నవ్వింది అవ్వ. చేతి మీద పాముల్లా బయట పడిన పచ్చనరాలను, జబ్బల దగ్గిర తోలుసంచుల్లా వేలాడు తున్న చర్మాన్ని చూసుకొంది. లెక్కకుమించిన ముడతలమధ్య ముడుచుకుపోయిన ముఖాన్ని ఒక సారి చేతితో తడుముకొంది.

"నా బొమ్మ ఏం గీస్తావు, నాయనా! చిలకల్లా ముస్తాబయి దారంట అంత మంది అమ్మాయిలు తిరుగుతున్నారు. వా ళ్లెవరిదైనా గియ్యి. అమ్ముకొంటే నాలుగు డబ్బులైనా వస్తాయి" అంది నెమ్మదిగా.

అవ్వ చిత్రాన్నే తను ఎందుకు గియ్యాలనుకొంటున్నాడో అతడు వివరించి చెప్పేడు. చిత్రకళా ప్రదర్శనంలో ప్రదర్శింపబడే బొమ్మలు, వాటిని చూడటానికి వచ్చే మనుష్యులు, వారు మెచ్చే రీతులు వర్ణించి చెప్పేడు.

అవ్వకి అవేమీ అర్థం కాలేదు. చేసుకోవాలని ప్రయత్నించలేదు. వింతగా అతడి మాటలు వింటూ అతడికి కాస్త మతి స్తిమితం తప్పి ఉంటుందని భావించింది. ఆ వయసులో అటువంటి జబ్బుకి గురైనందుకు విచారించింది. పాపం....పిచ్చి నాయన. ఎంత ఉత్సాహంగా అడుగుతున్నాడు! అవునంటే ఏం పోయింది అనుకొంది. "నీ ఇష్టం" అంది చివరికి.

కారుల బస్సుల రొదలో, చీమల బారుల్లా నడిచే మనుష్యుల అలజడిలో ఆ పేవ్‌మెంటుమీద ఆమె బొమ్మ గియ్యడం అసాధ్యం అనుకున్నాడు అతడు. చిత్రానికి తగిన పరిసరాలు ఉంటే బాగా రాణి స్తుంది అన్న తలంపుతో కాస్త మారుమూల ప్రదేశానికి, పెంట కుప్పలు, కూలిన కొంపలు విరివిగా ఉన్నచోటికి ఆమెని తీసుకు వెళ్లేడు.

అతడు కోరిన తీరులో రెండు రోజులు నిలబడింది అవ్వ. అతడి పని ఇంకా పూర్తికాలేదు. అవ్వ అలవాటుగా అడుక్కొనే స్థలం అక్కడికి చాలా దూరం. చుట్టుపక్కల ప్రదేశాలు దరిద్ర దేవత ఆరామంలా ఉన్నాయి. అడుక్కొనే అవకాశం లేదు. కడుపులో తిండి లేదు. కాళ్లలో నిలిచే శక్తి లేదు.

అవ్వకి కళ్లు తిరుగుతున్నాయి. కాళ్లు లాగుతున్నాయి. అయినా అతడికి ఇదేం పట్టలేదు. అసలు మనిషికి తిండి అవసరం అన్న విషయం అతడి ఆలోచనల చాయలకి రాలేదు. నిజానికి అతడికి కూడా ఆ రెండు రోజులు ఉపవాసమే. రెండు రోజులే అన్న మాటేమిటి, నెలలో ఇరవై రోజులు ఉపవాసం ఉండడం- కడుపు కింత తిండిపెట్టే ఉద్యోగాన్ని వదులుకొని ఈ చిత్రలేఖనం పిచ్చిలో పడ్డప్పటినుండి అతడికి అలవాటే. ఏదైనా అతడి చిత్రం అమ్ముడు పోయి నాలుగు డబ్బులు చేతిలో పడితే, చిత్రలేఖనానికి కావలసిన రంగులు కొంటాడు. కుంచెలు కొంటాడు. ఒంటి మీద మురికి పట్టిన బట్టలగురించి, కడుపులో కావుమంటున్న ఆకలి గురించి అతడు ఆలోచించడు. ఎవరైనా మిత్రులు మందలిస్తే, "మీ రంతా ఆలో చించి బాముకొంటున్న దేమిటి? మీరు జీవిస్తున్నారు, నేనూ బ్రతుకు తున్నాను" అంటాడు నవ్వుతూ.

నాలుగు రోజుల క్రిందట ఎవరో మిత్రుడు అతని స్థితి చూసి జాలిచెంది జేబులో నాలుగు రూపాయలు పెట్టేడు. వాటితో అవ్వ చిత్రం గీసేందుకు పెనిసిళ్లు వగైరా కొన్నాడు. ఆ సమయంలో మూడు రోజులై తను పస్తు ఉన్న విషయం అతడి మనసులోకి

రాలేదు. అవ్వ చిత్రం పూర్తయి చిత్రకళాసమితి ప్రదర్శనలో బహుమతి అందుకొంటే, ఆ వార్త విన్ననాడు తను పొందే అనుభూతి ఎలా ఉంటుందో ఊహించుకోడంతోనే కాలం సరిపోయింది.

అవ్వ కడుపులో ఆకలి గావు కేక పెట్టింది. ఆమె ముఖంలో ఆ బాధ ప్రతిఫలించింది. అతడి కళ్లు ఆనందంతో మెరిసేయి. క్షణకాలం అతడి చేతిలో పెనిసిలు ఆగింది.

''ఒక్క నిమిషం, అవ్వా! అలాగే ... అలాగే ఉండు. ఎంత చక్కని భంగిమ! ఎంత సహజంగా ఉంది ఆ చూపు.... 'ఆకలి పిలుపు!' చిత్రానికి పేరు కూడా స్థిరమయింది."

ఉత్సాహంగా గీతలు గీస్తున్నాడు. తుడుపులు పెడుతున్నాడు. యువకరక్తం పెడుతున్న ఆ పరుగులు చూస్తూ అవ్వ తన ఆకలి బాధ అప్పటికి మరిచిపోయింది.

"చిత్రం చాలా వరకు పూర్తయింది. ఇంక రెండు రోజులన్నా పట్టదు నాలుగైదు స్కెచ్‌లు, కొద్దిపాటి దిద్దుపాట్లు. అవ్వా, నీ కష్టం నా కష్టం తీరిపోతుంది. నీ బొమ్మ ఈ ఏడు బహుమతి అందుకు తీరవలసిందే.''

ఉత్సాహంగా చెప్పుకుపోతూ తన వస్తువులు సర్దుకొంటున్నాడు అతడు.

''బాబూ!" దీనంగా చూసింది అవ్వ.

"నేను అబద్ధం చెప్పడంలేదు, అవ్వా! నీ చిత్రానికి రెండో బహుమతి. అది తప్పినా మూడోదైనా ఫరవాలేదు. వచ్చిన సొమ్ములో సగం నీది. మనిద్దరం ఈ పనిలో భాగస్థులం అన్న మాట. నువ్వు కష్టపడి నేను కోరిన రీతిలో గంటల తరబడి నిలిచి ఉంటున్నావు. అంటే శారీరకశ్రమ మదుపు పెడుతున్నావు. నేను చాకచక్యంగా నీ రూపుని కాగితం మీదికి ఎక్కిస్తున్నాను. మరే ముంది? చిత్రం తయారై బహుమతి అందుకొంటే డబ్బు సరిగా పంచుకొందాం.

"వెయ్యి రూపాయలు. కనీసం ఐదు వందలు. అంత సొమ్ముతో ఏం చేస్తావో? మరి చుట్టాలకి పక్కాలకి విందు చేస్తావో, కావలసిన

వస్తువులే కొంటావో. ఊళ్ళే తిరిగి వస్తావో....మనసు కోరిందల్లా అనుభవించు. అవ్వా. తనివితీరా అనుభవించు."

తన కలల్ని ఆమెకి అంటకట్టాలని వ్యర్థ ప్రయత్నం చేసేడు అతడు. అతడి మాటలతో అవ్వ ఆకలి శాంతించలేదు. "బాబూ రెండు రోజులై తిండి లేదు. ఆకలితో కడుపు మాడిపోతున్నాది. చేతిలో ఒక్క పైసా అయినా లేదు.'' అవ్వ తన పొత్తికడుపుమీద గుడ్డపేలికను తొలగించి చూపింది. అక్కడ చర్మంతో తయారైన ఒక గొయ్యిలాంటిది ఉంది. ఆకలి మంటలు అందులోంచి పొగలు చిమ్ముతూ లేస్తున్నాయి.

గంటల తరబడి తను కోరిన పోజులో నిల్చేందుకు అవ్వకాళ్లకి శక్తికావాలి. అవ్వ కడుపుకి తిండి కావాలి. ఆ విషయాన్ని అప్పుడే గ్రహించినట్లు ఆమె వైపు వింతగా చూసేడు అతడు. ఆ విషయం అవ్వనోటితో చెప్పేవరకు తనకి తోచనందుకు బాధపడ్డాడు. అప్రయత్నంగా అతడి చేయి జేబులోకి వెళ్లింది. ఏమున్నాయి జేబులో? రెండు మూడు పెన్సిళ్లు, రబ్బరు ముక్కలు. అంతకు మించి అందులో మరేంలేవు. ఉదయం గది వదలేసరికి అతడి జేబులో నాలుగు పైసలు ఉండేవి. దారిలో అవిపెట్టి రెండు గ్లాసుల నీళ్లు తాగి కడుపు చల్లబర్చుకొన్నాడు.

చాతకాని తనం అతడిని ఈసడించింది. మాటరాని నోరు మూతబడింది. ఈ ముసలిదానికి ఎప్పుడూ తిండిగొడవే - మనసు విసుక్కొంది.

అఖిలభారత స్థాయిలో తన బొమ్మ పెద్దల మెప్పులు పొంది బహుమతి అందుకోబోనున్న తరుణంలో అవ్వ ఆకలి, తిండివంటి క్షుద్ర విషయాల గురించి ఆలోచించడం అతడికి బాగులేదనిపించింది. ఒక్క నాలుగురోజులు తిండిలేకపోతే ఏమయిపోతుంది? చిత్రం ఇంకా సహజంగా వస్తుంది. ఆటుతరువాత అంత సొమ్ముతో పీకమొయ్య ఎంత తినకూడదు?

ఆ మాటే అవ్వతో అన్నాడు.

"కొంచెం ఓపికపట్టాలి అవ్వా. రెండురోజుల్లో చిత్రం పూర్తవుతుంది. ఒక్క పదిరోజులు గడిచిపోతే........"

జేబులోకి పోయిన అతని చేతివంక ఆశగా చూస్తున్న అవ్వ అది కాళీగా రావడంతో కళ్లు దించుకొంది. అతడి మాటలు విని చిన్నగా నవ్వుకొంది. బారెడు దూరంలో ఉన్న ఎర్రని లక్కకాయ అందుకోవాలనే తాపత్రయంతో నేలమీద చేతులు, కాళ్లు ఆడిస్తూ ప్రాకడానికి ప్రయత్నిస్తున్న పసివాణ్ణి చూసి తల్లి నవ్వినట్లుంది ఆ నవ్వు.

మరి రెండు రోజులు గడిచేయి. అవ్వరూపులో ఆకలి విలయ తాండవం చేస్తున్నది. అతడి చేతిలోని పెన్సిలు ఉత్సాహంగా పరుగులు తీస్తున్నది.

అతడు చూపుతున్న ఆశలపట్ల అవ్వకి నమ్మకంలేదు. అతడు ఎరచూపిన డబ్బుపట్ల ఆమెకి కోరికలేదు. మరి బాధంతా-ఎందుకు భరిస్తున్నట్లు? ఆకలి కడుపుని కోస్తున్నా, కళ్లు తిరుగుతున్నా, కాళ్లలో శక్తిలేకున్నా గంటల తరబడి ఎందుకు నిల్చి ఉంటున్నట్లు?

ఆ రోజు చిత్రం పూర్తవుతుంది. ఒంటిలో నామ మాత్రంగా మిగిలి ఉన్న శక్తినంతా కూడగట్టుకొని అతడి ఎదుట నిల్చింది అవ్వ. అతడు తన మామూలు ధోరణిలో రేఖలలోకి ఆమె రూపుని దింపుతున్నాడు.

అంతలో ఆమె రూపు చలించింది. ఎదురుగా పెంట కుప్పమీద ఎవరో సగంతిని పారవేసిన మామిడిపండు. అవ్వకళ్లు ఆశతో మెరిసేయి. అవ్వ కడుపులో ఆకలి ఉరుకులు, పరుగులతో తోసుకొచ్చింది. అవ్వ కాళ్లకి అంతలోనే ఎక్కడినుండో బలం అందింది.

చిత్రకళా ప్రదర్శనలో బహుమతి కోసం చిత్రింపబడుతున్న తన చిత్రం గురించిన ఆలోచన ఆ క్షణంలో అవ్వకి గుర్తుకి రాలేదు. నాలుగు రోజులై కాలేకడుపుతో ఆ యువ చిత్రకారుని ముందు తను నిలబడి ఉన్న సంగతి ఆమె తలపుకి రాలేదు. ఎదు

రుగా ఆహారం ఉంది. ఆమె కడుపులో ఆకలుంది. అంతమాత్రమే ఆమె మెదడు గ్రహించింది. అవయవాలకి ఆ వార్త అందించింది.

ఆమె చూపులో వచ్చిన మార్పుని గమనించిన అతడు క్షణకాలం కారణం తెలియక తికమక పడ్డాడు. ఆమె చూపు నిల్చిన వైపు అతని దృష్టి మళ్ళింది. పెంట కుప్పమీద మామిడిపండు. దానిని కళ్ళతోనే ఆరగిస్తున్న అవ్వ.

ఆనందంతో అతడి మనసు ఎగిరి గంతేసింది. 'ఈ ఏడు చిత్రానికి మెదటి బహుమతి రావటం ఖాయం.' అహం ఆశని సరఫరా చేసింది.

అవ్వ కళ్ళలోని కాంతుల్ని చిత్రించడానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు అతడు. ఆకలి అవ్వకాలుని ముందుకి నెట్టింది. మనసు ఉత్సాహంగా 'ఊఁ' అంటూ అనుమతిఇచ్చింది.

"అవ్వా! ఆగు, కదలబోకు" మేఘగర్జనలా ఉంది అతడి మాట.

ఒకటి, రెండు, మూడు....నిమిషాలు వరుసగా దొర్లిపోయేయి. అతడి చేతిలోని పని ముగిసిపోయింది. ఐదురోజుల దీక్ష పూర్తి అయింది. అతడికి కావలసిన స్కెచ్‌లు తయారయేయి. దగ్గరగా దూరంగా పెట్టి వాటిని పరీక్షగా చూసేడు. సంతృప్తిగా ఊపిరి పీల్చేడు. పదిలంగా వాటిని ప్రక్కన పెట్టేడు.

'అవ్వా!' అంటూ వచ్చి ఆప్యాయంగా ఆమె చేతులు పట్టుకొన్నాడు. 'నీ కష్టం, నా కష్టం వృధాపోదు అవ్వా! దీనితో మన బాధలు తీరిపోతాయి,'' అన్నాడు తృప్తిగా.

అతడి చేతుల్ని అభిమానంతో నిమిరింది అవ్వ. 'నీ శ్రమ ఫలించాలి నాయనా' అనుకొంది మనసులో.

అతడు తన వస్తువులు సర్దుకొంటుంటే "బాబూ" అంది అవ్వ. 'నీ చిత్రం పూర్తయింది. ఇకనైనా నాకేదైనా తిండి పెట్టు' అన్నట్లు ఉన్నాయి ఆమె చూపులు. ఆ చూపుల అర్థం అతడు

గ్రహించేడు. కాని ఆమె కిచ్చేందుకు అతడి దగ్గర ఏమీలేదు. అందుకే సూటిగా ఆమె కళ్లలోకి చూడలేకపోయాడు.

"పదిరోజుల కంటే ఎక్కువకాలం పట్టదు అవ్వా! నీ భాగం పువ్వుల్లో పెట్టి ఇస్తాను. ఈ చిత్రానికి బహుమతి రాకుండాపోదు. అదృష్టం బాగుంటే వెయ్యి, రెండువేలు, కనీసం ఐదువందలు...."

అలవాటు పడిన ఆ మాటల్నే అప్పచెప్తున్నాడు అతడు.

అవ్వ జాలిగా అతడివైపు చూసింది.

"వెళ్లు నాయనా చాలా అలసిపోయిఉన్నావు" అంది నెమ్మదిగా.

ఆమెకి ఏ విధంగానూ సహాయపడలేని అతడు దీనంగా ఆమె వైపు చూసేడు.

ఒకానొక సమయంలో అటువంటి నిస్సహాయస్థితిని అవ్వ అనుభవించింది. ఆ చూపులోని భావం ఆమెకి పరిచయమయిందే. అవ్వ ఒక్కగానొక్క కొడుకు, తను చేయని నేరానికి పోలీసుల చేత దెబ్బలుతిని ఆస్పత్రిలో ఆమె చేతుల్లో ప్రాణం వదులుతూ ఆమెను చూసి కన్నీరు కార్చిననాడు ఆమెలో ఇటువంటి నిస్సహాయతే అలుముకొంది. ఏదో చెయ్యవలసిన సమయంలో ఏమీ చెయ్యలేని అశక్తత ఆమెని కుంగదీసింది. కష్టించి పనిచేస్తూ బ్రతుకుతున్న ఆమె జవసత్వాలు ఆనాడే ఉడిగిపోయేయి. ఆ నాటి నుంచి ఆమె బిచ్చకత్తె అయింది.

నీ చూపులోని అర్థం నాకు తెలుసు నాయనా! బాధ పడకు.... బాధ పడకు....అవ్వ మనసు ఓదార్పుగా పలికింది. అవ్వ కళ్లు సానుభూతిగా చూసేయి.

*   *   *

ఎన్ని రోజులు గడచిపోయాయో, ఎలా గడచి పోయాయో, అతడికి తెలియదు. ఆరోజు దగ్గర పడిందని ముందురోజునే మనసు హెచ్చరించింది. 'మత్తు వదలించుకొని కాస్త హుషారుగా ఉండు. నువ్విలా కునికిపాట్లు పడుతుంటే ఆ పుణ్యకాలం కాస్తా నీ

కళ్ళ పడకుండానే గడిచిపోతుంది. నీ కడుపు ఆకలిని గురించి ఏనాడో మరచిపోయింది. నీ కళ్లు నిద్రమీద ఆశ ఏనాడో వదులు కొన్నాయి. నువ్వు అంటూ ఒక మనిషిని ఉన్నావన్న మాటని ప్రపంచం మరచిపోకుండానే కాస్త కన్ను తెరువు.'

ఎవరో హెచ్చరిస్తున్నారనుకొంటూ తన్ను తానే హెచ్చరించు కొన్నాడు అతడు.

ఆ ఆలోచన మనసులోకి రాగానే కడుపులో ఆకలి కెలికింది. కళ్లమీదికి నిద్ర ముంచుకొచ్చింది. కాని అది నిద్రపోయే సమ యమా? ఆకలి గురించి ఆలోచించే అవకాశం ఎక్కడుంది?

ఆ రోజు వచ్చింది. ఫలితాలు తెలిసే రోజు. అతడి అదృష్టాన్ని విధి నిర్ణయించే రోజు. తెల్లవారింది. నిముషాలు సరుగులు పెడ్తు న్నాయి. గంటలు నడిచి పోతున్నాయి. ఎండ నెత్తిమీదికి తరుము కొచ్చింది. అయినా ఏ వార్తా తెలియలేదు.

అతడిలో నిరాశ- అపనమ్మకం నీడలో దాగిపోయింది. అతడి లోని చల్లబడిన ఉత్సాహం కన్నీళ్లముంపులో కరిగి పోయింది. తన చిత్రానికి బహుమతి రాలేదా? లేక పోష్టు బంట్రోతు తన ఎడ్రసు కనుక్కోలేక టెలిగ్రాం వెనక్కి తీసుకుపోయేడా?

ఒక్కసారిగా అతడికి కళ్లు తిరిగి నట్లయేయి. ఏదో అశుభం తన్ను వెంటాడుతున్నట్లు అన్పించింది.... అంత లోనే ఏదో ఓదార్పు. అలా ఎందుకవుతుంది? ఈ గదిలో తను ఎంత కాలంగా ఉంటు న్నాడు: తన గురించి ఇతరులకి తెలియకపోయినా తను ఆశ్రయ మిచ్చిన ఆర్టిస్టు రామారావు గురించి ఈ ఇంటికి తెలియకపోతుందా? దాటిపోతున్న పోష్టు బంట్రోతుకి అదైనా తన ఉనికి చెప్పదా?

ఇవన్నీ పిచ్చి ఆలోచనలు. తన చిత్రానికి బహుమతి రాకుండా ఎలా పోతుంది? దానిని తను ఎంతగా కష్టించి సృష్టించేడు! ఆశ తిరిగి అతనిలో జీవం పోసింది.

అంతలోనే ఆ సందు మొదట్లో సైకిలు బెల్లు విన్పించింది.... క్రమంగా అది దగ్గరై ఆ ఇంటి ముందు ఆగింది.

ఉన్న పళంగా అతడు పరుగుపెట్టా లనుకొన్నాడు. అతడి కాళ్లు సంతోషంతో కదలమన్నాయి. ఎవరది? గొంతుక చించుకొని అరవా లనుకొన్నాడు. నోటమాట నోటిలోనే నిల్చిపోయింది.

"రామారావుగారూ! టెలిగ్రాం సార్" తలుపు టకటక లాడింది.

ఆ పిలుపుతో అతడిలోని చైతన్యం ఉరకలు ట్టింది. ఒక్కసారిగా కాళ్లకి ఎక్కడలేని శక్తి పొంగు కొచ్చిందిపెవిసురుగా వెళ్లి తలుపు తీసేడు. సంతకంపెట్టి టెలిగ్రాం అందుకొన్నాడు.

అతడి చిత్రం 'ఆకలి పిలుపు'కి మొదటి బహుమతి! నిజమా, కలా అన్నట్లు తరచి, తరచి చూసేడు, అవే మాటలు. అంతే అర్థం. ఆనందంలో అతడు పల్టీలు కొడ్తుండగానే శుభ వార్త తెచ్చిన పోస్టు బంట్రోతు ఆశగా అతడి వైపు చూసేడు.

జేబులు తడుముకొన్నాడు అతడు. అలవాటుగా ఉట్టి చేతులు తిరిగివచ్చేయి. గదంతా కలియ జూసేడు. బహుమానంగా ఇచ్చేందుకు పనికివచ్చే వస్తువు ఒక్కటికూడా అక్కడలేదు

"డబ్బు అందేక కన్పించు" అన్నాడు.

ఇది ఇచ్చే ముఖమే అన్నట్లు చూసేడు పోస్టు బంట్రోతు. ఇంకో సమయంలో అయితే ఆ నిరసనకి అతడు బాధపడి ఉండును. కాని అప్పుడు అటువంటి వాటికి అతీతంగా అతడు ఏవో లోకాల్లో విహరిస్తున్నాడు. గులాబి రంగు కాగితం చేతిలో రెపరెప లాడుతున్నది.

పంచరంగుల జీవితం అతడి కళ్లముందు కదులాడుతున్నది.

అంతలోనే గుర్తుకొచ్చింది అవ్వ. ఆనాడు తరువాత తిరిగి తను ముఖం చూపలేదు. తన గురించి ఏమనుకొందో? ఆమె కష్టానికి ప్రతి ఫలంగా ఆ నాడు తను ఏమీ ఇయ్యలేకపోయేడు. అయితేనేం....తను అసత్యవాది కాడు. ఏరు దాటగానే తెప్ప తగల బెట్టే రకం కాదు. అన్నవిధంగా అక్షరాల ఆమె భాగం ఆమెకి పంచి ఇస్తాడు. అప్పుడు తెలుస్తుంది అవ్వకి తన నిజాయితీ, అప్పుడు తెలిసొస్తుంది ఆమెకి తన సామర్థ్యం.

ఆలోచనలతో అతడు అట్టే కాలం గడపదల్చుకోలేదు. ఆ సొమ్ములోనేకాక ఆ ఆనందంలో కూడా అవ్వకి భాగం ఈయాలను కొన్నాడు. గాలి కన్న వేగంగా వెళ్లి ఆ వార్త అవ్వకి అందియ్యా లని మనసు తొందరచేసింది. కాని బస్సుకి కూడా అతని దగ్గర డబ్బులు లేవు. ఆ టెలిగ్రాం చూపిస్తే ఎవరైనా సొమ్ము అప్పు పెడ్తారు కాని అది ముందుగా చూడవలసిన వ్యక్తి అవ్వ.

ఉత్సాహం అతడిచేత పరుగు పెట్టించింది. ఉద్రేకం అతడి మనసుని ఊపివేసింది. ఆ వార్త విన్నాక అవ్వ ముఖంలో ఉండే తీరు అతడి ఆలోచనల్ని ఆక్రమించుకొంది.

అతడి కాళ్లు తేలిపోతున్నాయి. అతడి కళ్లు తిరిగిపోతున్నాయి. అయినా పరుగు ఆపలేదు. నాలుగురోడ్ల కూడలి దగ్గరికి గాలి దుమారంలా వచ్చి పడ్డాడు.

అవ్వ అరుపుల కోసం అతడి చెవులు రిక్కించి విన్నాయి. అవ్వ రూపుకోసం అతడి కళ్లు వెతుకులాడేయి.

ఎర్రలైటు రోడ్డు దాటవచ్చునని అనుజ్ఞ ఇచ్చింది. పది అడుగులు వేసి పేవ్ మెంట్ వైపు పరీక్షగా చూసేడు. తెల్లటి దుప్పటి క్రింద అవ్వ నిశ్చలంగా నిద్రపోతున్నది. ప్రథమ బహు మతిని పంచుకోవలసిన అవ్వ ప్రపంచానికి దూరంగా వెళ్లిపోయింది.

అతడి కాళ్లలో శక్తి సన్నగిల్లింది. అతడి మనసులో ఆనందం తరిగిపోయింది. 'అవ్వా' అంటూ ఆమె ప్రక్కనే కూలబడ్డాడు.

అవ్వ తల దగ్గర ఒక డబ్బా ఉంది. అవ్వ కాళ్ల దగ్గర నలుగురు మనుష్యులు నిలబడ్డారు. అవ్వ అంత్యక్రియలకి వచ్చే పోయేవారిని అర్థిస్తున్నారు. 'ధర్మం చెయ్యండి బాబూ, దానం చెయ్యండి అమ్మా! అనాథప్రేత దహనం, కోటి తీర్థాల తిరిగినంత పుణ్యం."

నోరు ముయ్యకుండా ఒకరి తరువాత ఒకరుగా అరుస్తున్నారు.

అవ్వ అనాథ కాదు. అవ్వ నిర్ధనురాలుకాదు. ఐదువేల రూపా యల బహుమతికి భాగస్వామి. అమాటే వారితో చెప్పాలని నోరు

తెరవబోయేడు అతడు. ఆ నలుగురిలో ఒకడు అతడి ముందికి డబ్బా తెచ్చేడు. 'దయగల బాబులు ధర్మం చెయ్యండి. అనాథప్రేత దహనం....' అలవాటు పడిన పాటలా మొదలుపెట్టేడు.

అతడి చేతులు అప్రయత్నంగా జేబులోకి వెళ్లేయి. చేతిలోకి వచ్చింది గులాబిరంగు కాగితం. అతడి కంటినుంచి ఒక్క కన్నీటి బొట్టు అవ్వ శవంపై పడింది. కసిగా చేతిలోని కాగితాన్ని నులిపి ఆ డొక్కులో పడేసేడు.

'ఒక్క పదిరోజులు ఆగండి. అవ్వని పూల పల్లకిలో ఊరేగిద్దాం. మంచి గంధపు చెక్కలతో దహనం చేద్దాం. అవ్వ అనాథప్రేతం కాదు, దిర్భాగ్యురాలు కాదు' ఆవేశంగా అరిచేడు అతడు.

అక్కడివారు అతడివంక భయంగా చూసేరు.